క్లుప్తంగా

బగలాముఖి ఆలయంలో పౌర్ణమి పూజలు


హోమం నిర్వహిస్తున్న పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో హరిద్వార్చన, విశేష పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నిర్వాహకులు సూర్యకుమార్‌గౌడ్, పోచగౌడ్, కొండల్, నాగరాజు, వెంకటేశ్ తో పాటు తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


బాల హనుమాన్‌కు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, భక్తులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని ఏడవ వార్డులోని బాల హనుమాన్ ఆలయంలో గురువారం ఆలయ ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అర్చకుడు హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఏడవ వార్డు కౌన్సిలర్ రుక్కమ్మ, భక్తులు శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్వర్ తదితరులు పాల్గొని బాల హనుమాన్‌కు పూజలు చేశారు.

రంగనాయకుడికి రథోత్సవం


స్వామివారి పల్లకీ సేవలో చిన్నారులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలో కొలువైన రంగనాయక స్వామి రథోత్సవం గురువారం కనుల పండువగా సాగింది. శేషతల్పంపై కొలువైన లక్ష్మీ సమేత రంగనాయకుడి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పురవీధుల గుండా రథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీ, పవళింపు సేవ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మోడల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు


ప్రశంసా పత్రాలతో మోడల్ పాఠశాల విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట మోడల్ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రశంసాపత్రాలను అందించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో 9.5పైగా జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందించినట్లు తెలిపారు. చేగుంట మోడల్ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఘనంగా ఎల్లమ్మదేవి ఆలయ వార్షికోత్సవం


బోనాల ఊరేగింపులో భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్‌లోని ఎల్లమ్మదేవి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నారాగౌడ్, యాదగిరిగౌడ్, ఈశ్వర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డుతో నడకయాతన

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. దీనితో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. – నర్సాపూర్ రూరల్

- అధ్వానంగా సీతారాంపూర్ దారి
- జీటీ ప్రతిపాదనలకే పరిమితం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


సీతారాంపూర్ - రుస్తుంపేట రోడ్డు దుస్థితి

మండలంలోని సీతారాంపూర్ – రుస్తుంపేటరోడ్డు ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో సీతారాంపూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల, రేషన్ దుకాణం, పోస్ట్ ఆఫీస్, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, పశువుల ఆస్పత్రులు లేకపోవడంతో ప్రతీ అవసరానికి రుస్తుంపేట గ్రామానికి వెళ్లక తప్పదు. గతంలో సీతారాంపూర్ గ్రామం రుస్తుంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. పంచాయతీ కార్యాలయంతో పాటు ఇతర ఏ చిన్న అవసరమున్న గ్రామస్తులు రుస్తుంపేటకు పంట పొలాల గట్ల పైనుంచి వెళ్లి అవసరాలు తీసుకునేవారు. పలుమార్లు అధికారులు, రాజకీయ నాయకులతో మొర పెట్టుకోగా.. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో దివంగత రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ఈ రెండు గ్రామాల మధ్య మట్టి రోడ్డుతో పాటు కంకర రోడ్డు వేయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉండడంతో నడవలేని స్థితికి చేరింది.

అడుగు వేయలేని స్థితిలో..

వర్షాకాలంలో అయితే కనీసం అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో రోడ్డు ఉంటుంది. పలుమార్లు గ్రామస్తులు అధికారులు, రాజకీయ నాయకులతో తారు రోడ్డు వేయాలని పలుమార్లు మొరపెట్టుకోగా.. పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. సీతారాంపూర్ – రుస్తుంపేటతో పాటు నర్సాపూర్ – మెదక్ జాతీయ రహదారి నుంచి సీతారాంపూర్ వరకు బీటీ బీటింగ్ రోడ్డు ఏర్పాటు కోసం సుమారు రూ. కోటి 80 లక్షలు అంచనావేసి ప్రతిపాదనలు పంపారు. పలుమార్లు నిధులు విడుదల చేస్తామని మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి హామీ ఇచ్చి మర్చిపోయాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వర్షాకాలంలో తిరిగి ఇబ్బందులు ఎదుర్కొవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీనెల రేషన్ సరుకులు, ప్రతిరోజు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, మహిళలు, ఆస్పత్రి అవసరాలకు, పశువుల ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఏఈ స్వామిదాస్‌ను వివరణ కోరగా.. ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. విధుల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

తారు రోడ్డు వేయండి


సీతారాంపూర్ – రుస్తుంపేట వరకు తారు రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలి. వర్షాకాలంలో అన్ని అవసరాల కోసం గ్రామస్తులం అనేక తిప్పలు పడుతాం. అధికారులు, నాయకులు స్పందించి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలి.
– మన్నే భిక్షపతి, సీతారాంపూర్ గ్రామస్తుడు

ఘనంగా గరుడసేవ మహోత్సవం


గరుడసేవలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఆలయ అధ్యక్షుడు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం గరుడసేవ మహోత్సవం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకొని గరుడసేవలో భాగస్వాములయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు, అన్నదానం చేశారు. శుక్రవారం పొన్నసేవ జరుగుతుందని ఆలయ అర్చకుడు వేణు గోపాలశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అమరేందర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఫణిశశాంక్‌శర్మ, బాలనగర్ లయన్స్ క్లబ్ ఎల్బీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు లక్ష్మీకాంతారావు, పానగారి శ్రీనివాస్, యాదగిరి, తాటి నాగరాజు, అనంద్, తదితరులు ఉన్నారు.

నార్సింగిలో జీలుగు విత్తనాల పంపిణీ


నార్సింగి మండల కేంద్రంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ సబ్సిడీ ద్వారా పెద్ద జనుము, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి ఏఓ యాదగిరి కోరారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో రైతులకు సబ్సిడీ ద్వారా పెద్ద జనుము, జీలుగు విత్తనాలు అందించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. నార్సింగి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలోఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నాయని, ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తుందన్నారు. సబ్సిడీ పోను పెద్ద జనుము 40 కిలోల బస్తా రూ.1448, జీలుగు 30 కిలోల బస్తా రూ.1116 ధరను చెల్లించి కొనుగోలు చేయాలని తెలిపారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై పెద్ద జనుము, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ లక్ష్మీప్రవీణ్ తెలిపారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు


ఎమ్మెల్యే సునీతారెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

వెల్దుర్తి(తూప్రాన్): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ప్రతీఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపల్లికలాన్ గ్రామంలో గురువారం పెద్దమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నర్సింలు, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ గణేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేగుంట నుంచి వచ్చే 132/33కేవీ లైన్‌లోని మర్మమతుల దృష్ట్యా నిజాంపేట మండల పరిధిలోని నస్కల్, నార్లాపూర్, కల్వకుంట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చేగుంట మండల కేంద్రంలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. చేగుంటతో పాటు అనంతసాగర్, కర్నాల్‌పల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదు అన్నారు.

నేడు నార్సింగిలో ..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ స్వామి తెలిపారు. చేగుంట మండల కేంద్రంలోని 132 కేవీ విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు ఉన్నందున నార్సింగి, జప్తిశివనూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరావరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తూప్రాన్ మండలంలో..

మండలంలోని ఇస్లాంపూర్, మల్కాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడు తుందని విద్యుత్ ఏఈ వరహాలబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల కత్తిరింపుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు.

మాడాపూర్‌లో తాగునీటి సమస్య


ఎంపీడీఓ కార్యాలయం వద్ద తాగునీటి సమస్యను విన్నవిస్తున్న మాడాపూర్ గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని మాడాపూర్‌లో వారం రోజులుగా తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్తులు గురువారం ఎంపీడీఓ కార్యాలయనికి వచ్చారు. ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడంతో ఇతర అధికారులతో తాగునీటి సమస్యపై మొరపెట్టుకున్నారు. గ్రామంలో ఉన్న బోరు మోటార్ వారంరోజుల క్రితం పాడైపోయిందని చెప్పారు. ఆ విషయాన్ని పలుమార్లు ప్రత్యేక అధికారి, గ్రామ కార్యదర్శికి విన్నవించిన పట్టించుకోవడంలేదని తెలిపారు. ప్రతీరోజు తాగునీటి కోసం మహిళలు సుదూర ప్రాంతంలోని వ్యవసాయ బోర్ మోటార్లకు వద్దకు వెళ్లి తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి రవిని వివరణ కోరగా.. త్వరగా తాగునీటి సమస్య లేకున్నా కొంతమంది కావాలని సమస్యను సృష్టిస్తున్నారని చెప్పారు. మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్న బోరు మోటార్‌కు మరమ్మతులు చేయడం లేదని ఆరోపించడం విచారకరమన్నారు.

ఆకట్టుకున్న బండ్ల ప్రదర్శన


ఎడ్లబండ్ల ఊరేగింపులో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని చీలాపల్లిలో దుర్గమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రెండో రోజు సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను ఊరేగించారు. భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నెల రోజుల నుంచి నీటి తిప్పలు


మాట్లాడుతున్న మాడాపూర్ గ్రామస్తులు

నర్సాపూర్: మండలంలోని మాడాపూర్ గ్రామంలో నెల రోజుల నుంచి తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని మంచినీటి ట్యాంకుకు నీటి సరఫరా చేసే బోరు మోటార్ నెల రోజుల క్రితం పాడైపోయిందన్నారు. బోరు మోటార్ మరమ్మతులు చేయించడంలో గ్రామ కార్యదర్శి, ప్రత్యేక ఆఫీసర్లు నిర్లక్ష్యం చేయడంతో తాము నీటికి ఇబ్బందుల పాలవుతున్నామని ఆరోపించారు. పలుమార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి నీటి సమస్యను తీసుకుపోయినా ప్రయోజనం లేదని అన్నారు. నల్లాల నుంచి నీరు రానందున వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లు ఎత్తుకొచ్చుకుంటున్నామని తెలిపారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కిష్టయ్య, సంజీవ, మహేందర్, నర్సింలు, లింగయ్య, ప్రభాకర్, బ్యాగరి కిష్టయ్య ఉన్నారు.

మహిమాన్విత్వం వీరభద్రాలయం

- నేటి నుంచి 31 వరకు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ


కొలువుదీరిన భద్రకాళీ అమ్మవారు


ఆలయంలో కొలువైన వీరభద్రుడు

టేక్మాల్(మెదక్): నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు భద్రకాళీ సమేత వీరభద్రాలయం ముస్తాబైంది. ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలోని గుట్టపై భద్రకాళీ సమేత వీరభద్రుడు వెలిశాడు.

ఉత్సవాల వివరాలు...

నేటి నుంచి 31 వరకు నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగనున్నాయి. 24న గణపతి పూజ, భద్రకాళీ సమేత వీరభద్రుడికి అభిషేకం, రాత్రి 7గంటలకు అగ్ని గుండాలు. 25న భద్రకాళీ సమేత వీరభద్రుడికి అభిషేకాలు, ఎదుర్కొళ్లు, స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం షావ ఊరేగింపు. 26న ఉదయం గణపతిపూజ, అభిషేకం, గ్రామ దేవతలు దుర్గమ్మ, పోచమ్మలకు బోనాల ఊరేగింపు. 27న ఉదయం గణపతిపూజ, అభిషేకం, గ్రామ దేవతలకు బండ్ల ఊరేగింపు ఊరేగింపు. 28న ప్రత్యేక పూజలతో పాటూ కుస్తీ పోటీలు. 29న రథోత్సవం, 30న ప్రత్యేక పూజలతో పాటూ లంకాదహనం, 31న పాచిబండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు.

సమష్టి కృషితో..


ఉత్సవాలు ప్రారంభం అయిన నాటి నుంచి ఉపవాసదీక్షతో పూజలు నిర్వహిస్తాం. ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. గ్రామస్తులు సమష్ట కృషితో ఆలయ అభివృద్ధికి పనిచేస్తున్నారు.
– బస్వరాజ్, ఆలయ కమిటీ చైర్మన్, బొడ్మట్‌పల్లి

ఇబ్బందులు రానివ్వం


జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నీటి వసతి, పారిశుద్ధ్యం పనులు పూర్తి చేశాం. వసతుల కల్పనకు గ్రామస్తులు అన్ని రకాలుగా సహకరిస్తున్నారు.
– కృష్ణ, తహసీల్దార్, టేక్మాల్

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నర్సాపూర్ రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిపల్లి సమీపంలోని ఓ చెట్టు కింద గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి నిరసంగా పడిపోయి స్థానికులకు కనిపించాడు. ఆ వ్యక్తిని అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిస్తే నర్సాపూర్ సీఐ, ఎస్ఐ ఫోన్ నంబర్లకు 87126 57941, 87126 57940 సమాచారం ఇవ్వాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత వైద్య శిబిరం



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మేడ్చల్ మెడిసిటీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న 135 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చామని మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వినయ్, శ్రేయ, పూజిత తదితరులు ఉన్నారు.

◆ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెద్దశంకరంపేట(మెదక్): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఇంటర్ ఫస్టియర్‌లో 119 మంది విద్యార్థులు, సెకండ్ ఇయర్‌లో 48 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది అభిలాష్, అంజయ్య తదితరులున్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్ సప్లిమెంటరి ఎగ్జామ్స్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి 12 వరకు ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు సెకండ్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ గాలి బీభత్సం



పాపన్నపేట(మెదక్): మండలంలో గురువారం వీచిన జోరు గాలితో పలు విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. దీంతో రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. లక్ష్మీనగర్, యూసుఫ్‌పేట, కుర్తివాడ, మిన్‌పూర్ శివారులో వీచిన జోరు గాలికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. దీంతో వాహనాల రాక పోకలు కొంత నిలిచి పోయాయి. స్థానికులు, సిబ్బంది వాటిని తొలగించి రోడ్డు క్లియర్ చేశారు.

◆ ఆర్థికసాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డ తప్పెట సాయికిరణ్ కుటుంబానికి తోటి స్నేహితులు రూ.28వేల ఆర్థిక సాయం అందించారు. మృతుడికి భార్య ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కార్యక్రమంలో టెన్త్‌క్లాస్‌మెట్స్, ఎంపీటీసీ శివకుమార్ ఉన్నారు.

◆ దొంతిలో కళాజాత ప్రదర్శన

శివ్వంపేట(నర్సాపూర్): నేరాల నియంత్రణలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గురువారం రాత్రి మండల పరిధిలోని దొంతి గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అపరిచితుల ఫోన్‌కాల్స్, సైబర్ మోసాలు, మత్తు పదార్థాల నియంత్రణ తదితర అంశాలపై కళాజాత బృందం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

◆ విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి

టేక్మాల్(మెదక్): విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందిన సంఘటన టేక్మాల్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... టేక్మాల్ గ్రామానికి చెందిన నడోల్ల శంకరయ్య, లక్కాకుల మల్లప్పకు చెందిన మూడు పాడి గేదెలు మేతకు వెళ్లాయి. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామ శివారు ప్రాంతంలోని వ్యవసాయ పొలం వద్ద బుధవారం రాత్రి విద్యుత్ తీగలు తెగిపడగా సరిచేయక పోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోయారు. రూ.2లక్షల ఆస్తినష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.